

కాంగో నదిలో నిప్పంటుకొని మునిగిపోతున్న చెక్క పడవ

## పడవకు నిప్పంటుకుని 143 మంది మృతి

### కాంగోలో వందల మందికి గాయాలు

కిన్షాసా, ఏప్రిల్ 19: మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. చమురును తీసుకుని వస్తున్న భారీ పడవలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుని బోల్తా పడటంతో 143 మంది మృతి చెందగా, వందలాది మంది గాయపడ్డారు. ఆ దేశ అధికారులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 15న వందలాది మంది ప్రయాణికులతో పాటు చమురును తీసుకుని వస్తున్న భారీ చెక్క పడవకు కాంగో నదిలో ఈక్వాటార్ ప్రావిన్స్ రాజధాని మబండాకాకు సమీపంలో హఠాత్తుగా నిప్పంటుకుంది. అనంతరం పేలుడు సంభవించడంతో చాలా మంది సజీవ దహనమయ్యారు. కొంతమంది ప్రాణ భయంతో నీటిలోకి దూకేశారు. ఇంత వరకు 143 మృతదేహాలను వెలికి తీశామని, చాలా మంది మృతదేహాలు బొగ్గులా మారాయని అధికారులు తెలిపారు. పడవలో వంట కోసం నిప్పంటించేటప్పుడు జరిగిన నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు నిర్ధారించారు. ఈ దేశంలో కొన్ని నగరాలు, పట్టణాలకు తప్ప మిగిలిన చోట్లకు రోడ్డు, విమాన సౌకర్యాలు అంతగా లేవు. దాంతో చాలా మంది నదుల మీదుగా పయనిస్తుంటారు.

## విద్యార్థినులకు ప్రెగ్నెన్సీ కిట్లు!

- తరగతి గదుల్లో ఉపాధ్యాయుల మద్యపానం, ధూమపానం
- యూపీలో ఓ ఆశ్రమ పాఠశాల నిర్వహణపై బాలికల గగ్గోలు




లక్నో: బీజేపీ పాలిత ఉత్తర ప్రదేశ్‌లో ఆశ్రమ పాఠశాలల నిర్వహణ, బాలికల పట్ల అనుసరిస్తున్న వైఖరి ఎంత దారుణంగా ఉన్నదో జయప్రకాశ్ నారాయణ్ సర్వోదయ బాలికల ఆశ్రమ పాఠశాలను చూస్తే అర్థమవుతుంది. మీర్జాపూర్ జిల్లా, మదిహాన్ తహసిల్ పరిధిలో ఉన్న ఈ పాఠశాలలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు నీలం ప్రభాత్ తనిఖీలు నిర్వహించారు. విద్యార్థినుల ఫిర్యాదులపై దర్యాప్తు చేయాలని జిల్లా అధికారులను ఆమె ఆదేశించారు. ముగ్గురు సభ్యుల దర్యాప్తు బృందం ఈ పాఠశాలలో విచారణ జరిపింది. కొందరు బాలికలు గర్భవతులయ్యారని, వారికి ప్రెగ్నెన్సీ(గర్భ ధారణ) కిట్లను ఇచ్చారని విద్యార్థినులు ఈ దర్యాప్తు బృందానికి చెప్పారు. విద్యార్థినుల శానిటరీ ప్యాడ్స్‌ను పాఠశాల సిబ్బంది తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు గుట్కా తింటూ, సిగరెట్ కాల్చుతూ, విద్యార్థినులపై పొగ ఊదుతారని చెప్పారు. ఉపాధ్యాయినులు ఏసీ స్మార్ట్ క్లాస్‌రూంలో కూర్చుని మద్యం తాగుతారని, అక్కడే నిద్రపోతారని తెలిపారు. పాఠాలు చెప్పడానికి రమ్మని పిలిస్తే, తమను కొట్టి, పంపించేస్తారని ఆరోపించారు. తమకు టూత్‌బ్రష్, చెప్పులు సంవత్సరానికి ఒకసారి మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. రెండు సంవత్సరాల నుంచి బ్యాగులు, తువ్వాళ్లు ఇవ్వలేదన్నారు. డబ్బులిస్తేనే ప్రాక్టికల్స్‌లో మార్కులు వేస్తారని తెలిపారు. విద్యార్థినుల ఆరోపణలతో కూడిన నివేదికను దర్యాప్తు బృందం ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు పంపించింది.

# మన ఐటీకి ఢోకా లేదు

- ట్రంప్ సుంకాలతో మన టెక్ పరిశ్రమకు ప్రయోజనమే
- చైనా నుంచి భారీగా మన వద్దకు కంపెనీలు తరలి వచ్చే చాన్స్
- 'మేక్ ఇన్ అమెరికా'తో మరిన్ని ఉద్యోగాలు వస్తాయి
- యూరప్‌లో జీవన వ్యయం ఎక్కువ.. అందుకే ఉద్యోగుల గమ్యస్థానం 'అమెరికా'
- 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో టెక్నోజెన్ సీఈవో లాక్స్ చేపూరి





ల్యాక్స్ చేపూరి

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్ విధానాలతో ఇండియాతో పాటు హైదరాబాద్‌లో ఐటీ రంగానికి వచ్చే నష్టమేమీ లేదని టెక్నోజెన్ సీఈవో లాక్స్ చేపూరి అభిప్రాయపడ్డారు. అమెరికా చైనాపై విధిస్తున్న ప్రతీకార సుంకాలతో భారత్‌కు అనేక కంపెనీలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ట్రంప్ 'మేక్ ఇన్ అమెరికా' అని ఆయా సంస్థలను యూఎస్‌ఏకి ఆహ్వానిస్తున్నారని.. భవిష్యత్తులో ఉద్యోగాల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు. హెచ్1బీ వీసా ఉన్నవారు తమ వీసా స్టేటస్ సరిగా ఉంచుకుని.. అమెరికా చట్టాలు పాటిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన తెలిపారు. 'గోల్డెన్ వీసా'కు రూ.45 కోట్లు (5 మిలియన్ డాలర్లు) లీగల్ మనీ వెచ్చించి వెయ్యి మంది దరఖాస్తు చేసుకున్నారంటే అమెరికా క్రేజ్ ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు. యూరప్‌లో జీవన వ్యయం ఎక్కువ.. అందుకే ఐటీ ఉద్యోగాలకు అమెరికా గమ్యస్థానంలా ఉంటుందనడంలో సందేహం లేదు' అని ఆయన అన్నారు. శనివారం 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను లాక్స్ చేపూరి పంచుకున్నారు.

**నమస్తే తెలంగాణ:** సుంకాల విషయంలో ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో మన ఐటీ సెక్టార్‌పై ఏమైనా ప్రభావం ఉంటుందా..?

- **ల్యాక్స్ చేపూరి:** ట్రంప్ ప్రభుత్వం టారిఫ్‌లను వస్తువులపై మాత్రమే విధిస్తున్నది తప్ప.. సేవలపై కాదు. దీంతో మన ఐటీ రంగంపై ప్రత్యక్షంగా ప్రభావం ఉండదు. ఆయా ఉత్పత్తులపై విధిస్తున్న టారిఫ్‌ల ప్రభావంతో సెమి కండక్టర్లు, కంప్యూటర్‌లో వాడే చిప్‌ల ధరలు పెరుగుతాయి. ట్రంప్ టారిఫ్ విధానంతో పరోక్షంగా భారత్‌కు లాభమే. చైనా నుంచి అనేక కంపెనీలు మన దేశానికి తరలివచ్చే అవకాశం ఉంది. చైనాపై అమెరికా విధించిన సుంకాల కారణంగా ఆపిల్ కంపెనీ తన ఉత్పత్తిని మన దేశానికి తరలిస్తున్నది. ఫాక్స్‌కాన్ కంపెనీ సైతం ఇక్కడ ప్రొడక్షన్ పెంచుతున్నది. ఈ పరిణామాలతో భారత్‌లో ఉద్యోగాల సంఖ్య పెరిగే చాన్స్ ఉన్నది.

**నమస్తే తెలంగాణ:** ట్రంప్ విధానాలతో ప్రత్యక్షంగా హైదరాబాద్ ఐటీ ఉద్యోగులపై ప్రభావం ఎలా ఉండబోతున్నది?

- **ల్యాక్స్ చేపూరి:** ట్రంప్ టారిఫ్ విధానాలతో హైదరాబాద్ ఐటీ ఉద్యోగులకు లాభమే. అమెరికాలో పేరు గాంచిన వాల్‌మార్ట్‌లాంటి సంస్థకు 90 శాతం ఉత్పత్తులు చైనా నుంచి వస్తాయి. చైనాపై 245 శాతం ప్రతీకార పన్ను విధించిన కారణంగా ఇకపై వాల్‌మార్ట్ సైతం తన ఉత్పత్తులను మన నుంచి అమెరికాకు పంపేలా చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే అనేక సంస్థలకు చైనా తన ఉత్పత్తులు పంపుతున్నది. భవిష్యత్తులో వాటన్నింటినీ భారత్ నుంచే పంపే అవకాశం ఉంది. దీని కారణంగా మన దగ్గర ఉద్యోగాల సంఖ్య పెరుగుతుంది.

**నమస్తే తెలంగాణ:** హెచ్1బీ వీసా కలిగి ఉన్న మన వాళ్లపై ట్రంప్ నిర్ణయాలు ఏ మేరకు ప్రభావం చూపుతాయి?

- **ల్యాక్స్ చేపూరి:** ట్రంప్ అధికారంలోకి వచ్చాక హెచ్1బీ వీసా విషయంలో కొత్త రూల్స్ పెట్టడం లేదు. అక్కడి చట్టాలు పాటిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. వీసా స్టేటస్ సరిగా నిర్వహించకపోతే సమస్య తలెత్తుతుంది. హెచ్1బీ వీసా ఉన్న వాళ్లు భయపడాల్సిన అవసరం లేదు. రెండు-మూడు నెలల్లో అమెరికాలో వాతావరణం అంతా సాధారణంగా మారిపోతుంది. 'మేక్ ఇన్ అమెరికా'లో భాగంగా అనేక కంపెనీలు యూఎస్‌లో తమ సంస్థలు ఏర్పాటు చేసుకోనున్నాయి. ఆ సమయంలో వారికి కేవలం మిషనరీ ఉంటే సరిపోదు. కచ్చితంగా మ్యాన్ పవర్ అవసరం ఉంటుంది. దీంతో భారత్‌కు మరిన్ని హెచ్1బీ వీసాలు వచ్చే అవకాశం ఉంది.

**నమస్తే తెలంగాణ:** భవిష్యత్తులో మన దగ్గర ఐటీ విస్తరణ ఎలా ఉండబోతున్నది?

- **ల్యాక్స్ చేపూరి:** ఇండియాతో పాటు హైదరాబాద్‌లో ఐటీ విస్తరణ కొనసాగుతుంది. ఏ ఐటీ కంపెనీ అయినా రెండేండ్ల ముందు నుంచే తమ కంపెనీ ఏర్పాటుకు మార్కెట్, సౌకర్యాలు ఎలా ఉన్నాయి.. అని పరిశీలిస్తుంది. నాణ్యతగా పనిచేసే ఉద్యోగుల కోసం చూస్తుంది. మన దగ్గర సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలు కలిగినవారు, ఇంగ్లీష్ బాగా వచ్చిన వాళ్లు పుష్కలంగా ఉన్నారు. కాబట్టి యూఎస్ నుంచి కంపెనీలు ఇండియాకు వస్తున్నాయి. రానున్న 3 నుంచి 6 నెలల్లో కంపెనీల విస్తరణ ప్రభావం ఇండియాతో పాటు హైదరాబాద్‌లో ఉంటుంది.

**నమస్తే తెలంగాణ:** ఖర్చుల నియంత్రణలో భాగంగా అమెరికా ప్రభుత్వం పలు కంపెనీలతో ఒప్పందాలు రద్దు చేసుకుంటున్నది కదా? ఈ పరిణామాన్ని ఎలా చూడొచ్చు..?

- **ల్యాక్స్ చేపూరి:** ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డోజ్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ) ఆయా కంపెనీల్లో ఉన్న వృథాను తగ్గించుకునేందుకు కాంట్రాక్టులను సమీక్షిస్తున్నది.అమెరికా ప్రభుత్వానికి 36 ట్రిలియన్ డాలర్ల అప్పు ఉంది. ఈ కారణంగా అనవసర ఖర్చులు తగ్గించుకుంటున్నది. ఒక వేళ ఆయా కంపెనీలతో తమకు లాభం లేదని పిస్తే ఒప్పందాలను రద్దు చేసుకుంటున్నది. ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత గత రెండు నెలల్లో ఆయా కంపెనీల కాంట్రాక్టులు రద్దు చేయడం ద్వారా రూ.14-15 వేల కోట్లు ఆదా చేసింది. దీంతో పాటు ట్యాక్స్, రెవెన్యూ, హెల్త్ సెక్టార్‌లో ఇదే రకమైన విధానాన్ని అవలంబిస్తున్నది. అఫ్ఘన్ యుద్ధంలో అమెరికా 2 ట్రిలియన్ డాలర్లు, ఉక్రెయిన్ యుద్ధానికి 372 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. వీటికి అయిన అప్పులను తగ్గించుకునేందుకు కంపెనీలతో ఒప్పందాలు రద్దు చేసుకుంటున్నది.

**నమస్తే తెలంగాణ:** తాజా పరిణామాలతో అమెరికాలో ఉంటున్న భారతీయుల ఆలోచనా ధోరణి ఎలా ఉంది?

- **ల్యాక్స్ చేపూరి:** ప్రస్తుతం విద్యార్థుల్లో ఆందోళన ఎక్కువగా ఉంది. అందుకే కాస్త ఇబ్బందులు ఉన్నాయి. రెండు మూడు నెలల్లో పరిస్థితి సాధారణంగా మారిపోతుంది. గ్రీన్ కార్డు ఉన్న సిటిజన్లకు ఇబ్బందులు ఉండవు. కానీ ఏం జరగబోతున్నదనే ఆసక్తి మాత్రం వారిలో ఉంది. అమెరికా-భారత్ మధ్య సత్సంబంధాలు ఉన్నాయి. భారతీయులు చట్టరహిత కార్యకలాపాలకు పాల్పడరని అమెరికన్లు నమ్ముతారు. దీంతో అక్కడి ఉద్యోగాలకు మనవాళ్లను ఎక్కువగా తీసుకుంటారు.

**నమస్తే తెలంగాణ:** అమెరికాలో స్థిర పడ్డ మన వాళ్లు హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెడుతుంటారు.. ట్రంప్ నిర్ణయాల ఎఫెక్ట్ రియల్ రంగంపై ఏమైనా ఉంటుందా?

- **ల్యాక్స్ చేపూరి:** ట్రంప్ నిర్ణయాలతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌పై ఎలాంటి ప్రభావం ఉండదు. తాత్కాలికంగా కొంత స్తబ్దత ఉన్నా.. ఆరు నెలల్లో అంతా సాధారణ స్థితికి వస్తుంది. ఇప్పటికిప్పుడు హెచ్1బీ వీసా, గ్రీన్ కార్డు వచ్చినవారు పెట్టుబడి పెట్టలేరు. హైదరాబాద్‌లో సైతం భూముల ధరలేమీ తక్కువగా లేవు. గతంలో ఎకరాల్లో భూమి కొంటే.. నేడు వంద గజాలు కొంటే చాలు అనే పరిస్థితికి వచ్చాం. భవిష్యత్తులో అంతా కుదురుకున్న తర్వాత రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టే వాళ్లు పెరుగుతారు.

**నమస్తే తెలంగాణ:** ప్రస్తుతం నెలకొన్న పరిణామాలతో రానున్న రోజుల్లో అమెరికా ఉద్యోగులకు గమ్యస్థానంగా ఉంటుందా? లేదా యూరోప్ లాంటి ఇతర దేశాలను ఎంచుకోవాలా?

- **ల్యాక్స్ చేపూరి:** ఎప్పటికైనా డాలరే కింగ్‌లా ఉంటుంది. యూరప్ విషయానికొస్తే అక్కడ జీవన వ్యయం ఎక్కువ. అమెరికాలో ప్రశాంతమైన వాతావరణం ఉంటుందని ఇక్కడికి రావడానికి భారతీయులు మొగ్గు చూపుతారు. గోల్డెన్ వీసాకు రూ.45 కోట్లు (5 మిలియన్ డాలర్లు) డబ్బులు వెచ్చించి వెయ్యి మంది అప్లై చేసుకున్నారంటే అమెరికా క్రేజ్ ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు. అమెరికాకు ఉన్న అప్పులు తగ్గించుకోవడానికి ఇదో ఎత్తుగడలా సైతం చూడొచ్చు.

### గురి తప్పిన తూటా.. భారత విద్యార్థిని మృతి

#### కెనడాలో ఘటన

హామిల్టన్: గురి తప్పిన తూటా కెనడాలో భారతీయ విద్యార్థిని హర్‌సిమ్రత్ రణధవా (21)ని బలి తీసుకుంది. ఆమె హామిల్టన్‌లోని మొహాక్ కాలేజీలో చదువుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆమె బుధవారం రాత్రి 7 గంటల సమయంలో కార్యాలయానికి వెళ్లేందుకు బస్సు కోసం బస్టాప్‌లో వేచి చూస్తుండగా సమీపంలో ఇద్దరు కారు డ్రైవర్ల మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో గురి తప్పిన తూటాల్లో ఒకటి రణధవా ఛాతీలోకి దూసుకెళ్లింది. పోలీసులు బాధితురాలిని దవాఖానకు తరలించారు. కానీ అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయారు. మృతురాలి కుటుంబానికి అవసరమైన సహాయం అందిస్తున్నట్టు టొరంటోలోని ఇండియన్ కాన్సులర్ జనరల్ తెలిపింది.

### ఢిల్లీలో కూలిన భవనం 11 మంది దుర్మరణం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ముస్తఫాబాద్ ప్రాంతంలో శనివారం నాలుగు అంతస్తుల భవనం కూలిపోయింది. ఈ దుర్ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. నార్త్ ఈస్ట్ జిల్లా అదనపు డీసీపీ సందీప్ లాంబా తెలిపిన వివరాల ప్రకారం, సహాయక బృందాలు 14 మందిని కాపాడాయి. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సుమారు పది మంది శిథిలాల కింద చిక్కుకుని ఉంటారని ఆందోళన వ్యక్తమవుతున్నది. అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక అధికారి రాజేంద్ర అట్వల్ చెప్పారు.

### నకిలీ పోర్టల్స్‌తో జాగ్రత్త

#### చార్‌ధామ్ యాత్రికులకు కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆన్‌లైన్ బుకింగ్ మోసాలు ముఖ్యంగా చార్‌ధామ్ యాత్రికులు, భక్తులను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న మోసాలపై కేంద్ర హోం శాఖ పరిధిలో పనిచేసే ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ప్రజలను అప్రమత్తం చేసింది. నకిలీ వెబ్‌సైట్లు, నకిలీ సోషల్ మీడియా పేజీలు, ఫేస్‌బుక్ పోస్టులు, గూగుల్ వంటి సెర్చ్ ఇంజిన్లపై కనిపించే పెయిడ్ ప్రకటనల ద్వారా ఈ మోసాలు జరుగుతున్నాయని సెంటర్ వెల్లడించింది. చార్‌ధామ్ యాత్రికులకు హోటల్ బుకింగ్‌లు, ట్యాక్సీ రిజర్వేషన్, తీర్థ యాత్రలు వంటి సేవలు అందచేస్తామంటూ ఈ నకిలీ వెబ్‌సైట్ల ద్వారా మోసాలు జరుగుతున్నాయని సెంటర్ పేర్కొంది.

### విద్యార్థులతో మద్యం తాగించిన టీచర్

#### సస్పెండ్ చేసిన ఎంపీ అధికారులు

భోపాల్: విద్యార్థులను సన్మార్గంలో నడిపించాల్సిన ఉపాధ్యాయుడు వారిని పెడదారి పట్టించి దొరికిపోయాడు. మధ్యప్రదేశ్‌లోని కట్నీ జిల్లాకు చెందిన ఓ ప్రభుత్వ స్కూల్ టీచర్ తన వద్ద చదువుకుంటున్న విద్యార్థుల చేత మద్యం తాగించారని తెలిసి జిల్లా అధికారులు ఆ టీచర్‌ను సస్పెండ్ చేశారు. ఖిర్హానీ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల టీచర్ నవీన్ ప్రతాప్ సింగ్ కప్పులలో మద్యం పోసి విద్యార్థులకు అందచేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. తాగే ముందు అందులో నీళ్లు కలుపుకోవాలంటూ విద్యార్థులకు టీచర్ సలహా ఇవ్వడం కూడా అందులో వినిపించింది. ఉపాధ్యాయ వృత్తి గౌరవ మర్యాదలను దెబ్బ తీసినందుకు నవీన్ ప్రతాప్ సింగ్‌ని సస్పెండ్ చేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు.

### ఇజ్రాయెల్ దాడి.. గాజాలో 90 మంది మృతి

గాజా స్ట్రిప్, ఏప్రిల్ 19: గాజాపై ఇజ్రాయెల్ తన దాడులను కొనసాగిస్తూనే ఉంది. గత 48 గంటల్లో ఇజ్రాయెల్ దళాలు పెద్దయెత్తున జరిపిన దాడుల్లో 90 మంది మరణించినట్టు గాజా ఆరోగ్య శాఖ శనివారం వెల్లడించింది. మృతుల్లో 15 మంది మహిళలు, పిల్లలు ఉన్నట్టు తెలిపింది. కాగా, హమాస్ నిరాయుధీకరణ, తమ బందీల విడుదల కోసం ఇటీవల ఇజ్రాయెల్ గాజాలో దాడులను ఉధృతం చేసింది. పెద్దయెత్తున సెక్యూరిటీ జోన్‌లను ఆక్రమించుకోవాలన్నది ఇజ్రాయెల్ ప్రస్తుత ప్రణాళిక.

### దళిత సీఎంకు ఇంకా టైమ్ రాలేదు

#### కర్ణాటకలో పరిస్థితిపై ఓ మంత్రి వ్యాఖ్యలు

బెంగళూరు, ఏప్రిల్ 19: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందిన మరో మంత్రి సంచలన వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలో దళితుడు ముఖ్యమంత్రి అయ్యేందుకు సమయం ఇంకా రాలేదంటూ మంత్రి మునియప్ప శనివారం వ్యాఖ్యానించారు. ఈ విషయం గురించి మాట్లాడేందుకు ఇది సమయం కాదని, ముఖ్యమంత్రి పదవిలో సిద్ధరామయ్య కొనసాగుతారని ఆయన అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ కొత్త అధ్యక్షుడి నియామకంతో సహా అన్ని వ్యవహారాలపై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని, అందరూ ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటారని ఆయన చెప్పారు. సమయం వచ్చినప్పుడు ముఖ్యమంత్రిగా తమకు అవకాశం ఇవ్వాలని దళితులు కోరుకుంటున్నారని ఆయన వెల్లడించారు. సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు ఇవ్వాలని కాంగ్రెస్ భావిస్తుందని దళిత సీనియర్ నాయకుడైన మునియప్ప విలేకరుల ప్రశ్నకు జవాబిచ్చారు.

## రాష్ట్రపతికి కోర్టులెందుకు ఆదేశాలివ్వలేవు?

- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నిలదీత
- రాజ్యాంగం 75 ఏండ్ల ప్రస్థానంపై ఉత్సవాలకు బదులు ఆత్మ పరిశీలన అవసరమని సూచన



చెన్నై, న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: పార్లమెంట్ లేదా రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన చట్టాలను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించే అధికారం సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులకు ఉన్నపుడు అధికారిక విధుల నిర్వహణకు సంబంధించి రాజ్యాంగపరమైన పదవుల్లో ఉన్న రాష్ట్రపతి, గవర్నర్లకు ఆదేశాలు ఇచ్చే అధికారం కూడా ఉంటుందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. భారత రాజ్యాంగం 75 ఏండ్ల ప్రస్థానంపై శనివారం చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రసంగించిన అనంతరం మద్రాస్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సీటీ సెల్వం అడిగిన ప్రశ్నకు జస్టిస్ చలమేశ్వర్ సమాధానమిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. గవర్నర్లు నివేదించిన బిల్లులపై 3 నెలల్లోగా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ రాష్ట్రపతికి సుప్రీంకోర్టు గడువు విధించడంపై ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ పార్లమెంట్ చేసిన చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమని న్యామమూర్తులుగా మనం ప్రకటించే అధికారం ఉన్నపుడు ఆ చట్టాలను చేసిన ప్రజాప్రతినిధులు తమ విధులను నిర్వహించడానికి గడువు విధించే అధికారం మనకు ఎందుకు ఉండదని జస్టిస్ చలమేశ్వర్ ప్రశ్నించారు. అంతకుముందు ఆయన ఉపన్యసిస్తూ రాజ్యాంగం ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయిన ఈ సందర్భాన్ని ఉత్సవాలు జరుపుకోవడానికి బదులుగా ఆత్మ పరిశీలనకు లభించిన అవకాశంగా భావించాలని సూచించారు. గడచిన 75 ఏండ్లలో రాజ్యాంగానికి వందకు పైగా సవరణలు జరిగాయని, ఎన్నికల్లో గెలుపు కోసం అభ్యర్థులు విచక్షణారహితంగా డబ్బులు ఖర్చు చేశారని, న్యాయ వ్యవస్థకు కేటాయించిన అసమగ్ర బడ్జెట్ కేటాయింపుల కారణంగా బకాయిలు పెరిగిపోయాయయని, ఇవన్నీ ఆందోళనకరమైన అంశాలేనని ఆయన అన్నారు.

**సుప్రీంకోర్టు గీత దాటి లేదు: జస్టిస్ రస్తోగీ**

రాష్ట్రపతి, గవర్నర్ల చర్యలు న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయని ఇటీవల సుప్రీంకోర్టు చెప్పడం లక్ష్మణ రేఖను దాటినట్లు కాదని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగీ అభిప్రాయపడ్డారు. ఓ వార్తా సంస్థకు శనివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, న్యాయస్థానాల అభిప్రాయాలతో పార్లమెంట్ ఏకీభవించకపోతే, నిబంధనలను సవరించే సర్వోన్నత అధికారం పార్లమెంట్‌కు ఉందని పునరుద్ఘాటించారు. న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ పరస్పరం ఢీ కొంటున్నాయనే వాదనను తోసిపుచ్చారు.

**ఆర్టికల్ 142 ప్రయోగం సరైందే: జస్టిస్ జోసఫ్**

మన దేశ రాజ్యాంగం రాష్ట్రపతికి కల్పించిన అధికారాలు పరిమితమేనని పేర్కొంటూ, బిల్లులను ఆమోదించడానికి నిర్దిష్ట కాలపరిమితి విధిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసఫ్ స్వాగతించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును ఉద్దేశించి అది 'సూపర్ పార్లమెంట్'గా వ్యవహరిస్తున్నదని, ప్రజాస్వామ్య శక్తులపై ఆర్టికల్ 142 'అణు క్షిపణి'గా మారిందంటూ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలపై ఒక ఆంగ్లమీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన స్పందించారు. సుప్రీం కోర్టు రాజ్యాంగ పరిరక్షకునిగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. బిల్లులను గవర్నర్ నెలల పాటు పెండింగ్‌లో ఉంచిన క్రమంలో, ఆయనకు, రాష్ట్రపతికి ఉన్న అధికారాలను గుర్తు చేస్తూ.. సుప్రీం కోర్టు 142 అధికరణను ఆవాహన చేసుకుని తీర్పు చెప్పడం సరైనదేనని అన్నారు.

## సుప్రీంకోర్టుపై బీజేపీ దాడి

- కోర్టులే చట్టాలు చేస్తే పార్లమెంట్‌ను మూసేయొచ్చు
- బీజేపీ ఎంపీ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: సుప్రీంకోర్టు పరిమితులను ప్రశ్నిస్తూ బీజేపీ నేతలు మాటల దాడికి దిగుతున్నారు. మొన్న..ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయగా, తాజాగా బీజేపీ సీనియర్ నాయకుడు సర్వోన్నత న్యాయస్థానంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టు ఈ విధంగా వ్యవహరిస్తూ పోతుంటే ఇక పార్లమెంట్‌ను మూసివేయడం మంచిదంటూ బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే శుక్రవారం వ్యాఖ్యానించారు. 'సుప్రీంకోర్టే చట్టాలు చేస్తే పార్లమెంట్‌ను మూసివేయాలి' అని ఎక్స్ వేదికగా దూబే ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను దృష్టిలో పెట్టుకుని దూబే ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. వక్ఫ్ చట్టంలోని అనేక అంశాలపై సుప్రీంకోర్టు అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో తదుపరి విచారణ వరకు చట్టంలోని వివాదాస్పద నిబంధనలను అమలు చేయకూడదని కేంద్రం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## బెయిల్ తిరస్కరణపై కొత్త భాష్యం వద్దు

### మధ్యప్రదేశ్ హైకోర్టుకు సుప్రీంకోర్టు చురకలు



న్యూఢిల్లీ: శిక్షా కాలంలో సగం పూర్తయిన తర్వాతనే బెయిల్ దరఖాస్తు విజ్ఞప్తిని అంగీకరిస్తామంటూ మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు ఇవ్వడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన సుప్రీం కోర్టు చట్టానికి కొత్త భాష్యం చెప్పవద్దంటూ మొట్టికాయలు వేసింది. తన శిక్షను సవాల్ చేస్తూ నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌పై అధిక పెండింగ్ కేసుల కారణంగా సమీప భవిష్యత్తులో విచారించే అవకాశం లేనప్పుడు అతనికి తప్పక బెయిల్ మంజూరు చేయాలని ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు ఓ కేసులో నిందితుడికి బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు ఎలాంటి ఆధారం లేని కొత్త ప్రతిపాదన కనిపెట్టడం ఆశ్చర్యానికి గురి చేసిందని గురువారం వ్యాఖ్యానించింది. చట్టాన్ని హైకోర్టు యథాతథంగా అమలు చేయాలని, బెయిల్ కోసం ముందుకు వెళ్లాలని పిటిషనర్‌ను బలవంతం చేయకూడదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిందితుడు రెండోసారి బెయిల్ కోసం అభ్యర్థించినప్పుడు 'జైలు శిక్షలో సగం అనుభవించిన తర్వాత మాత్రమే నిందితుడు బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఈ న్యాయస్థానం స్పష్టం చేస్తున్నది' అని హైకోర్టు పేర్కొనడాన్ని ధర్మాసనం తీవ్రంగా తప్పు పట్టింది.



### భారత్ తొలి ఏఐ సర్వర్ ఆవిష్కరణ

#### అభివృద్ధి చేసిన వీవీడీఎన్ టెక్నాలజీస్

కొచ్చి: కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ శుక్రవారం దేశపు తొలి ఏఐ సర్వర్‌ను ప్రదర్శించారు. మానేసర్‌లోని వీవీడీఎన్ టెక్నాలజీస్‌కు చెందిన గ్లోబల్ ఇన్నోవేషన్ పార్క్‌లో ఆయన మాట్లాడుతూ... ఇందులో 8 జీపీయూలు ఉన్నాయన్నారు. అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్, కృత్రిమ మేధలో మన దేశం మంచి పురోగతి సాధిస్తున్నదని మంత్రి చెప్పారు. వీవీడీఎన్ టెక్నాలజీస్ చేస్తున్న కృషిని ప్రశంసించారు.




### మనుషులతో రోబోల పరుగు పోటీ

*బీజింగ్: రోబోలు ఇళ్లు, హోటళ్లలో సేవలందించడమే కాదు మారథాన్‌లో మనుషులతో పోటీ పడుతున్నాయి! చైనాలో ఇటీవల జరిగిన హాఫ్ మారథాన్‌లో ఈ కనువిందు చేసే దృశ్యాలు కనిపించాయి. బీజింగ్‌లో జరిగిన 21 కిలోమీటర్ల యిజువాంగ్ హాఫ్ మారథాన్‌లో వేలాది మంది మనుషులతోపాటు 21 రోబోలు పాల్గొన్నాయి. చైనాలో గతంలోనూ మారథాన్‌లలో రోబోలు కనిపించినప్పటికీ, అవి మనుషులతోపాటు పరుగులు తీయడం ఇదే తొలిసారి.*



### గంజాయికి క్యాన్సర్‌ను తగ్గించే సామర్థ్యం

*న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: క్యాన్సర్ లక్షణాలను తగ్గించే సామర్థ్యం గంజాయి మొక్కల్లో ఉందని తాజా అధ్యయనం వెల్లడించింది. క్యాన్సర్ చికిత్సలో గంజాయి (మెడికల్) వాడకాన్ని సమర్థించే ముఖ్యమైన ఆధారాలను కొత్త అధ్యయనం కనుగొన్నది. గంజాయి మొక్కల్లో ఔషధ గుణాలు క్యాన్సర్ వ్యాధిని ఎదుర్కొనగలదని 'ఫ్రాంటియర్స్ ఇన్ ఆంకాలజీ' జర్నల్ కథనం పేర్కొన్నది. ముఖ్యంగా క్యాన్సర్ లక్షణాలను పరిష్కరించటంలో గంజాయి సామర్థ్యం అద్భుతంగా ఉందని పరిశోధకులు తేల్చారు.*

### వియ్యంకుడితో పారిపోయిన వియ్యపురాలు!

*లక్నో: తన కూతురు మామ (వియ్యంకుడు)తో కలిసి ఓ మహిళ పారిపోయింది. ఇంట్లోని నగలు, నగదును వెంట తీసుకెళ్లింది. భర్త ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పారిపోయిన ఇద్దరి కోసం పోలీసులు వెతుకుతున్నారు. ఉత్తరప్రదేశ్ బుదౌన్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. 43 ఏండ్ల మమతకు నలుగురు పిల్లలు. ఆమె భర్త లారీ డ్రైవర్. కూతురి మామతో మమతకు వివాహేతర సంబంధం ఉన్నట్టు సమాచారం. భర్త లేనప్పుడు వియ్యంకుడిని తన ఇంటికి పిలిపించి, ఏప్రిల్ 11న అతడితో కలిసి మమత పారిపోయినట్టు తెలిసింది.*



### రోదసిలోకి నీటి ఎలుగుబంటి!

*న్యూఢిల్లీ: ఏక్సియమ్-4 మిషన్ ద్వారా రోదసిలోకి వెళ్తున్న శుభాంశు శుక్లా, అక్కడ వోయేజర్ టార్డిగ్రేడ్స్ (నీటి ఎలుగుబంట్లు)పై ప్రయోగాలు చేయబోతున్నారు. కేవలం 0.3 మి.మీ. నుంచి 0.5 మి.మీ పొడవు ఉండే జీవులివి. భూమి, సముద్రాల్లో, ధ్రువపు మంచులో, శూన్యం, రేడియేషన్, వేర్వేరు ఉష్ణోగ్రతలుగల వాతావరణాల్లో జీవించగలవు. ఇవి రోదసిలో ఎలా జీవిస్తాయనే అంశంపై ఇస్రో పరిశోధన చేయనున్నది. ఇవి గుడ్లు పెట్టి, ఎలా పొదుగుతాయి? అనే అంశాలను వ్యోమగాములు పరిశీలిస్తారు.*